ప్రజాశక్తి

మంగళవారం 25 ఏప్రిల్ 2023

5

అల్లూరి సీతారామరాజు

గందరగోళంగా ఎనిమిదో తరగతి హిందీ పరీక్ష

ప్రజాశక్తి-పెదబయలు: ఎనిమిదో తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులు సోమవారం నిర్వహించిన హిందీ పరీక్ష ప్రశ్నపత్రం చూసి తెల్లముఖం వేశారు. అసలే అర్థం కాని భాష, అందులోనూ మాస్టార్లు చెప్పిన టెక్స్టుబుక్‌లోని పాఠ్యాంశాల్లోని ప్రశ్నలు కాకుండా, జనరల్ నాలెడ్జ్ మాదిరిగా అన్నీ బయట ప్రశ్నలే ఇవ్వడంతో సరిగ్గా పరీక్ష రాయలేకపోయామని అనేకమంది విద్యార్థులు వాపోయారు. ప్రశ్నపత్రంలో ఒకటి నుంచి 15వ ప్రశ్న వరకు మల్టీపుల్ ఛాయిస్ బిట్స్ కావడంతో సమాధానం తప్పో, రైటో తెలియకున్నా గుడ్డిగా టిక్ పెట్టేశామని పలువురు విద్యార్థులు అంటున్నారు. 16 నుంచి 26వరకు పేరాగ్రాఫ్ ప్రశ్నలు, 27,28 ప్రశ్నలు వ్యాకరణానికి సంబంధించినవి, 29వ ప్రశ్న ఫోటోను చూసి కిందనున్న ప్రశ్నలకు జవాబు రాయడం, ఇక చివరిదైన 30వ ప్రశ్న విద్యార్థులకు సొంతంగా సమాధానం రాయాలని ప్రశ్న ఇవ్వడంతో దాదాపు అందరూ తెల్లముఖం వేసి, తెల్లకాగితాలే తిరిగిచ్చేశామని అంటున్నారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కులు ఆధారంగా పాసయ్యే పరిస్థితి లేకున్నా, గందరగోళంగా ప్రశ్నపత్రం ఇవ్వడం వల్ల పరీక్ష నిర్వహించి ప్రయోజనమేంటని విద్యార్థులు వాపోతున్నారు.

పోరాడుతారా.. ఇంటికి పోతారా..?

- ఎమ్మెల్యేలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు సూటి ప్రశ్న
- వైసిపి, బిజెపి, టిడిపి రాజకీయ పన్నాగాలను తిప్పి కొట్టాలని పిలుపు
- ప్రజల్లో చైతన్య స్ఫూర్తి నింపిన ప్రచారభేరి పాదయాత్ర

ప్రజాశక్తి - పాడేరు: బోయ/వాల్మీకుల్ని ఎస్టీల్లో చేర్చడానికి, హైడ్రో పవర్ ప్రాజెక్టులకు అనుమతులు కల్పించడానికి ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను పోరాడి అడ్డుకుంటారా? లేకుంటే పదవులకు రాజీనామా చేసి ఇంటికి పోతారా? అని వైసిపి ఎంపీ, ఎమ్మెల్యేలు, మంత్రులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి శ్రీనివాసరావు సూటిగా ప్రశ్నించారు. గిరిజన సంపదను దోచిపెడుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆలంబిస్తున్న ప్రజావ్యతిరేక, నిరంకుశ మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ సోమవారం సిపిఎం సిపిఐ సంయుక్తంగా పాడేరు నియోజకవర్గంలో నిర్వహించిన పాదయాత్ర చైతన్యస్ఫూర్తితో విజయవంతమైంది.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీలేరు నుంచి పాడేరు వరకు ప్రచార భేరి ద్వారా సిపిఎం సిపిఐ నాయకులు గ్రామాల్లో నినదించారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా పాడేరులో వామపక్ష పార్టీల శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివాసీలంతా బోయ/వాల్మీకుల్ని ఎస్టీల్లో చేర్చడాన్ని హైడ్రో ప్రాజెక్ట్ పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేకిస్తుంటే చోద్యం చూస్తున్నారా అని ఎమ్మెల్యేలను ప్రశ్నించారు. గిరిజన చట్టాలు, హక్కులను కాలరాస్తున్న వైసిపి, టిడిపి, బిజెపిల రాజకీయ పన్నాగాన్ని తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స మాట్లాడుతూ కమ్యూనిస్టుల వల్లే గిరిజన హక్కులు, చట్టాలకు రక్షణ ఉందని అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో 1/70 చట్టం సవరణకు పూనుకుంటే అప్పుడు ఎర్రజెండా ఎమ్మెల్యేలే అడ్డుకొని పోరాటం సాగించారనిగుర్తు చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ కోసం వామపక్షాలను మరింత బలోపేతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ మాట్లాడుతూ పాదయాత్రలో అనేక సమస్యలను గిరిజనులు తెలిపారని, సాగునీటికి తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామాలకు మట్టిరోడ్లే శరణ్యంగా మారాయని ఆవేదన వెలిబుచ్చారు. ఓట్లు వేసి గెలిపించిన గిరిజనులను ముఖ్యమంత్రి జగన్ మోసం చేశారన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారం, వారికిచ్చిన హామీల అమలు, ఏజెన్సీ అభివృద్ధిపై తీవ్ర నిర్లక్ష్యం చూపిన జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు గిరిజనులు ఎదురుచూస్తున్నారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ 1/70 చట్టాన్ని తీసేయాలని ప్రభుత్వం చూస్తోందని దీన్ని వ్యతిరేకించి పోరాడాలని పిలుపునిచ్చారు.

ప్రచారభేరి ర్యాలీలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సిపిఐ నేత వెంకటరమణ తదితరులు

ఐటిడిఎలకు ప్రత్యేక నిధులు లేకుండా పోయాయని, కనీసం గ్రామాల్లో డ్రైనేజీలు నిర్మాణం, పారిశుధ్య పనులు చేపట్టేందుకు కూడా నిధులు లేని పరిస్థితి ఉందని అన్నారు పంచాయతీలకు నిధులు ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు ఏజెన్సీలో 107 స్కూల్స్ ఎత్తివేసారని, ఇంకా చాలా పాఠశాలలను మూసేసే ఆలోచనలో ప్రభుత్వం ఉండడం దుర్మార్గమన్నారు. దీని వల్ల గిరిజనం అక్షరాస్యత పూర్తిగా అడుగంటుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ హైడ్రో ప్రాజెక్టులను గిరిజనులు వ్యతిరేకిస్తున్నారని, గిరిజన యువత ఉపాధి అవకాశాల కల్పన కోసం ప్రభుత్వం పరిశ్రమలను నెలకొల్పాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా నాయకుడు పాలికి లక్కు మాట్లాడారు. సిపిఎం మండల కార్యదర్శి ఎల్ సుందర్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ నాయకులు బాలేపల్లి వెంకటరమణ కూడా రాధాకృష్ణ , భీమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారభేరి బహిరంగ సభలో పాల్గొన్న సిపిఎం, సిపిఐ కార్యకర్తలు, ప్రజలు

నేడు అరకులో బహిరంగ సభ

జీపు జాతా ప్రచారంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

అనంతగిరి : ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టే ప్రచారభేరి పాదయాత్రలో భాగంగా ఈనెల 25న, మంగళవారం అరకు లోయలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజానీకం హాజరై విజయవంతం చేయాలని సిపిఎమ్‌కు చెందిన స్థానిక జెడ్‌పిటిసిజడ్పిటిసి దీసరి గంగరాజు పిలుపునిచ్చారు సోమవారం మండల కేంద్రంలోని వారపు సంతలో జీపుజాతాలో ప్రచారం నిర్వహించారు. జూనియర్ కాలేజ్ నుండి ప్రారంభమైన జీపుజాతా ప్రచారం, మూడు రోడ్లు కూడలి మీదుగా వారపు సంత, కొత్తవలస గ్రామం వరకు కొనసాగింది

ఈసందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, మూడోసారి అధికారంలోకి రావాలని తాపత్రయపడుతున్న బిజెపికి చెక్ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఆదానీ, అంబానీలకు దేశాన్ని, దేశ సంపదను తాకట్టు పెట్టడంతోపాటు ధరాభారం, పన్నులమోత, నిరంకుశ ప్రజావ్యతిరేక విధానాలతో సామాన్యుల జీవతం దుర్భరం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన అవసరం ఉందన్నారు. టోకూరు, గుమ్మ కోట, పెద్దకోట పంచాయతీల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి రహస్య ఒప్పందం, స్టీల్‌ప్లాంట్ వంటి పలు ప్రభుత్వరంగసంస్థలకు బాహాటంగానే అమ్మకానికి పెట్టిన కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. జిఒ 3రద్దుపై నిర్లక్ష్యం చూపడమే కాకుండా, బెంతు ఒరియాలు, బోయ/వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చి గిరిజనులకు అన్యాయం చేస్తున్న రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. అరకు బహిరంగసభను జయప్రదం ద్వారా కేంద్రప్రభుత్వానికి హెచ్చరిక పంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టోకూరు సర్పంచ్.కె.మొస్య. సిపిఎం మండల కార్యదర్శి. ఎస్.నాగులు, మండల నాయకులు. జె.సుబ్బారావు.జె.భీమన్న. పాల్గొన్నారు.

4న చింతూరులో బహిరంగ సభ

విఆర్.పురం : చింతూరు మే 4న జరుగుతున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయం బహిరంగ సభ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారం ఊసే లేదని తెలిపారు. పూర్తి పునరావాసం, పరిహారం జాబితా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, పులి సంతోష్ కుమార్, గుండుపూడి లక్ష్మణరావు, వడ్లాది రమేష్, కుంజా నాగిరెడ్డి, నల్లారిపు ప్రకాష్, హాజరత్ తదితరులు పాల్గొన్నారు.

రేఖపల్లిలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

ప్రజల సమస్యలు వింటున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

స్పందనకు 41 అర్జీలు

ప్రజాశక్తి - రంపచోడవరం

స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 41 అర్జీలు వచ్చాయి. వీటిని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, ఎపిఒ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. రంపచోడవరం మండలం మర్రివాడ గ్రామం నుండి పెద్ద కొండ గ్రామం వరకు మూడున్నర కిలోమీటర్లకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, రాజవొమ్మంగి మండలం గడవకుర్తి పంచాయతీలోని దోనెలపాలెం, గొబ్బెల మడుగు మధ్యలో మూడు కిలోమీటర్లకు ఫారెస్ట్ క్లియరెన్స్ ఇప్పించి రోడ్డు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. చీడిపాలెం గ్రామంలో కొత్తచెరువు ఊర చెరువు నీరు గ్రామం వరకు వస్తుందని, ఈ చెరువుకు గేటువాలు తూరలు ఏర్పాటు చేయాలని, దోనెల పాలెం గ్రామంలో దాటిగుమ్మ కాలువ నుండి దొర చెరువుకు నీరు మళ్లించాలని విజ్ఞప్తి చేశారు. రంపచోడవరం మండల పరిషత్ పాఠశాలకు నాడు నేడు పథకం ద్వారా అదనపు తరగతి గదులు ఏర్పాటు చేయాలని, ఏజెన్సీలోని అన్ని ఆశ్రమ పాఠశాలలకు హెల్త్ వర్కర్లను నియమించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికి అప్పుడు పర్యవేక్షించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ రాజు, డియస్ శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజు, ఎండి యూసఫ్, నాగేశ్వరరావు, వెలుగు ఏపిడి ఏ.శ్రీనివాసరావు, డిఎల్‌పిఒ శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ ఆర్టికల్చర్ అధికారి రాంబాబు, సిడిపిఒ సంధ్యారాణి, ఏఎంవో సి.శ్రీహరి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బొడ్డలంక సర్పంచ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఉత్తమ పంచాయతీగా బొడ్డలంక

ప్రజాశక్తి -అడ్డతీగల

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని బొడ్డలంక గ్రామం ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. ఈ మేరకు ఉత్తమ పంచాయతీ అవార్డును గ్రామ పంచాయతీ సర్పంచ్ బోనం రాఘవకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కే బాపన్న దొర, అడ్డతీగల సర్పంచ్ పప్పుల చిట్టెమ్మ ఆధ్వర్యాన రాఘవను, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రత్నరాజు, ఇఓపిఆర్డి ప్రసాద్, 22 పంచాయతీలకు చెందిన సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

డి పట్టాల పంపిణీకి తక్షణ చర్యలు

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు : గిరిజన రైతులకు డి.ఫారం పట్టాలు పంపిణీకి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయం నుండి 22 మండలాల రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూముల రీసర్వే, పివిటిజి ఓటర్ల నమోదు, గిరిజన సమస్యల పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేసారు. 250 గ్రామాలలో ఇంకా వెక్టరైజేషన్ చేయాల్సి ఉందన్నారు. అడ్డతీగల, రంపచోడవం, మారేడిమిల్లి, పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు, అరకువ్యాలీ మండలాల్లో వెక్టరైజేషన్ పనులు వేగం పెంచాలన్నారు. మ్యుటేషన్లు చేయడంలో జాప్యం చేయకూడదని సూచించార.. పివిటిజి ఓటర్ల నమోదు పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఫారం 6, ఫారం 7 సేకరణ వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. మే 15లోగా బిఎల్‌ఓలతో సమావేశాలు నిర్వహించాలని తాహశీల్దారులకు సూచించారు. బిఎల్‌ఓలకు పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. బిఎస్‌ఎన్‌ఎల్, జియో సెల్ టవర్ల నిర్మాణాలకు అవసరమైన భూములను త్వరతిగతిన సేకరించాలని ఆదేశించారు.

ఉపాధి హామీలో ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు

గంజాయి సాగు నిర్మూలనలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రత్యామ్నాయ పంటలు వేయడానికి ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. గిరిజన రైతలు మంచి దిగుబడులు సాధించి విధంగా లాభదాయకమైన పంటలను వేయడానికి ప్రోత్సహించాలన్నారు. జాబ్ కార్డుదారులందరకి ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో 30లక్షల జాబ్ కార్డుదారులకు ఉపాధి పనులు కల్పించాలని లక్ష్యాలను నిర్దేశిస్తూ సచివాలయాలను ఎంపిడిఒలు తనిఖీ చేయాలని సూచించారు. ప్రభుత్వ నుండి జీతాలు తీసుకుంటూ సక్రమంగా పనిచేయకపోతే సచివాలయం సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

10 మంది ఎంపిడిఒలకు షోకాజ్ నోటీసులు

ఉపాధి పనులు సక్రమంగా చేయని వి.ఆర్‌పురం, మారేడిమిల్లి, రంపచోడవరం, కూనవరం, వై.రామవరం, గంగవరం, పాడేరు, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, జి.మాడుగుల, దేవీపట్నం ఎంపిడిఒలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. సక్రమంగా విధులు నిర్వహించని సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్‌ల ఎస్‌ఆర్‌లు కలెక్టరేట్‌కు పంపించాలని ఎంపిడిఒలను ఆదేశించారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాసు, పాడేరు ఐటిడిఎ పిఒ, వి.అభిషేక్, రంపచోడవరం పిఒ సూరజ్ గనోరే, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్‌ఒ. పి.అంబేద్కర్, సర్వే సహాయ సంచాలకులు వై. మోహనరావు, డ్వామా పిడి రమేష్ రామన్, డి ఎల్‌పిఒ పిఎస్.కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్. నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- పెదబయలులో రేకుల ఇల్లు ధ్వంసం
- హుకుంపేటలో విరిగిన విద్యుత్‌స్తంభాలు

పాడేరులో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి- పాడేరు టౌన్

ఉదయమంతా ఎండ... మధ్యాహ్నమైతే వర్షం ఇలా.. గత కొన్నాళ్లుగా కొనసాగుతున్న పరిస్థితులు సోమవారం కొనసాగాయి. సాయంత్రం వరకు ఎండతీవ్రత కొనసాగి, తర్వాత ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో వర్షం కురవడంతో పెదబయలులో ఒక రేకులిల్లుపైకప్పు పూర్తిగా ఎగిరిపోగా, హుకుంపేటలో విద్యుత్ స్తంభం, వైర్లు నేలకూలాయి.

పాడేరులో సాయంత్రం 3 గంటల వరకు ఎండ తీవ్రతకు భయపడి ఇళ్ల నుంచి జనం బయటకు రాలేని పరిస్థితి ఉంటే, తర్వాత ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గంటన్నర సేపు కురిసిన వర్షానికి పాడేరు పట్టణం తడిచి ముద్దయింది. భారీగా వర్షం కురవడంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షానికి పట్టణంలోని రోడ్లు, వీధులు చిత్తడిగా మారాయి. చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని గంటన్నరకు పైగా వర్షం కురవడంతో ఎండ దాటికి అల్లాడిపోతున్న ప్రజలు ఉపశమనం పొందుతున్నారు.

ఈదురుగాలులతో రేకులిల్లు ధ్వంసం

పెదబయలు రూరల్ : మండలంలోని కొరవంగి పంచాయితీ కన్నులమెట్ట గ్రామంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షానికి వంతాల చిరంజీవి అనే వ్యక్తికి చెందిన రేకులిల్లు పైకప్పు పూర్తిగా ఎగిరిపోయింది. సిమెంట్ రేకులు ఎగిరిపడడంతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇంటి మట్టిగోడలు తడిసి పోవడంతో కూలిపోయే పరిస్థితి ఉందని బాధితుడు వాపోతున్నాడు. ఇటీవల రూ.25వేలు వెచ్చించి, ఇంటికి రేకుల పైకప్పు వేశామని, ఈదురుగాలుల దెబ్బకు పైకప్పు ఎగిరిపోవడంతో నిరాశ్రయలయ్యామని దంపతులు వాపోతున్నారు.

గాలి బీభత్సానికి విరిగిన విద్యుత్ స్తంభం

హుకుంపేట : మండలంలోని తీగల వలస పంచాయతీ గరుడపల్లి గ్రామంలో సోమవారం ఈదురుగాలుల బీభత్సానికి విద్యుత్‌స్తంభం విరిగిపడింది. విద్యుత్ వైర్లు సమీప ఇంటిపై పడగా, ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఈదురు గాలుల దెబ్బకు పలుచోట్ల స్తంభాలు చెట్లు కూలిపోయాయి. మరుమూల బిజ్జాపల్లి గ్రామంతో విద్యుత్‌స్తంభాలు కూలిపోయే స్థితిలో ప్రమాదభరితంగా ఉన్నాయని, సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

సీలేరులో భారీ వర్షం

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. సోమవారం ఉదయం నుంచి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపగా, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. దీంతో సీలేరులో చల్లటి వాతావరణం నెలకొంది.

పెదబయలులో ధ్వంసమైన ఇంటి వద్ద భార్యాభర్తలు

హుకుంపేట గరుడపల్లిలో విరిగిన విద్యుత్ స్తంభం

'పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం'

ప్రజాశక్తి- అడ్డతీగల

పేదల సంక్షేమమే పరమావధిగా సీఎం జగన్ పరిపాలన సాగుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వేకి కోటి మిస్డ్ కాల్స్ పూర్తయిన సందర్భంగా అడ్డతీగలలో ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులు ఎకౌంట్లోకి వేస్తున్నట్లు చెప్పారు. ప్రతినెల 1వ తేదీన రూ.2750 చొప్పున పింఛన్లను ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాఘవ, ఎంపీటీసీ రత్నం, ఈశ్వరి, సర్పంచ్ పప్పుల చిట్టెమ్మ, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఆధార్ సేవలను పరిశీలిస్తున్న సిఐ అశోక్‌కుమార్ తదితరులు

ఉచితంగా ఆధార్ సేవలు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో సేతు కార్యక్రమంలో భాగంగా పోలీసులు ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జీకే వీధి సిఐ అశోక్ కుమార్ వెల్లడించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు దుప్పిలివాడ గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న ప్రజలు ఆదార్ సేవలు ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. ఆధార్ కార్డులో అడ్రస్సు, పేర్లు తదితర మార్పులు చేర్పులు చేసుకోవడానికి చక్కటి అవకాశమని, దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగానే ఇప్పటివరకు 70 మంది మారుమూల గ్రామాల ప్రజలు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. మరొక రెండు రోజులపాటు ఆధార సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆధార్ కొత్త కార్డులు నమోదు చేర్పులు మార్పులు చేసుకోవాలంటే దానికి సంబంధించిన డాక్యుమెంట్లు తప్పనిసరిగా తీసుకురావాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- విఆర్.పురం



మాట్లాడుతున్న జె127 మినిస్ట్రీ ప్రతినిధులు

యవ్వనస్తులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డేవిడ్ లివిస్టాన్ అన్నారు. మండలంలోని సంతపాకల వద్ద షాలోమ్ ప్రేయర్ హౌస్ మందిరంలో డేవిడ్ లివింగ్ స్టన్ ఆధ్వర్యంలో బైబిల్ కథలతో కూడిన సమావేశ కూడిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత టీవీలు, సెల్ ఫోన్లు వల్ల చాలా పాడైపోతున్నారని, వారిని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. 10వ తరగతి నుండి డిగ్రీ వరకు వరకు చదువుతున్న యవ్వనస్తులు ఏసుక్రీస్తు మాటలు వినడం వలన చెడు మార్గంలో నుంచి మంచి మార్గంలోకి రావడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. జె127 మినిస్ట్రీ నాయకులు పాస్టర్ గాబ్రియేలు మాట్లాడుతూ బయట సమాజంలో ఏవిధంగా నడుచుకోవాలని, దేవునిలో భయభక్తులతో ఎలా నడుచుకోవాలని అనేవి సూచించారు. సుమారు 80 మందితో ఈ కార్యక్రమం జరిగింది. వచ్చిన పిల్లలకు బైబిల్ కథలు, ఆటలు, పాటలు నిర్వహించారు. బైబిల్ కథల పుస్తకాలు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో మండల పాస్టర్ విజయనంద్, పాస్టర్ మోజెస్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఏడాదైనా బోరును బాగుచేయరా..?

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: మండల కేంద్రంలోని అంగన్వాడీ వద్దనున్న మంచినీటి బోరు మరమ్మతుకు గురై ఏడాది గడుస్తున్నా నేటికీ బాగుచేసే తీరిక అధికారులకు లేదాయని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. సోమవారం నిరుపయోగంగానున్న బోరు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర డెలిగేట్ సభ్యుడు పి చిన్నస్వామి మాట్లాడుతూ బోరు పాడవ్వంతో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతూ, గెడ్డలు, ఊటకుంటల్లోని కలుషిత నీటిని ఆశ్రయిస్తున్నా అధికారులకు చీమకుట్టినట్టయినా లేకపోవడం దారుణమన్నారు. వెంటనే పాడైన బోరును బాగుచేసి, నీటి ఎద్దడితీర్చాలని కోరుతున్నారు. అలాగే మామిడిచెట్టువీధిలో చిరుజల్లులు కురిసినా రోడ్డంతా బురదమయపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సిసి రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి మదన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

జిసిసి గొడౌన్ వద్దకు గిరిజనం తీసుకొచ్చిన చింతపండు

గిరిజనులకు 'చింత'

సంతలో కొనేవాళ్లు లేక దళారుల పాలు

కూలిరేట్లయినా గిట్టుబాటు కాలేదని ఆవేదన

ప్రజాశక్తి- పెదబయలు రూరల్ : పెదబయలు వారపుసంతకు మారుమూల సుదూర ప్రాంతం నుంచి చింతపండును అమ్మకానికి తెచ్చిన గిరిజనులు నానా అవస్థలు పడ్డారు. సంతలో చింతపండు కొనేవాళ్లెవరూ లేకపోవడంతో జిసిసి డిపో వద్దకు మోసుకెళ్లారు. అక్కడ జిసిసి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో గత్యంతరం లేక, తెచ్చిన చింతపండును తిరిగి ఇళ్లకు మోసుకెళ్లలేక కిలో రూ.20లకే అడ్డుగోలుగా విక్రయించామని వాపోతున్నారు. కనీసం తాము తెచ్చిన మోత కూలీలు కూడా గిట్టుబాటు కాలేదని వారంతా వాపోతూ, ఈసురోమంటూ వెనుదిరిగారు. గిరిజన అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాల్సిన జిసిసి ముఖం చాటేయడంతో గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని, గత్యంతరం లేక దళారులు, వ్యాపారులను ఆశ్రయిస్తున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిసిసి యంత్రాంగం తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పనిచేసే సర్పంచ్‌ల గుర్తింపులో వివక్ష!

అవార్డుల ఎంపిక, ప్రదానంపై పలువురి గుర్రు

ప్రజాశక్తి -అనంతగిరి : జాతీయస్థాయి ఉత్తమ పంచాయతీ అవార్డుల ఎంపికలో పనిచేసేవారిని కాకుండా అనుయాయులను ఎంపిక చేయడంపై టోకూరు సిపిఎం సర్పంచ్ కిల్లో మొస్య, బొర్రా టిడిపి సర్పంచ్ జన్ని అప్పారావు అభ్యంతరం వ్యక్తం చేశారు. తొమ్మిది కేటగిరీల్లో అవార్డులను ప్రకటించగా, కనీసం పారిశుధ్యపనులు చేయని పంచాయతీలకు ఏడేసి విభాగాలకు అవార్డులకు ఎంపిక చేశారన్నారు. పనిచేసేవారికి కాకుండా ఎంపిపి సూచించిన వారికి, ముఖ్యంగా అధికారపార్టీ వారికే అవార్డులు ఇవ్వడం వాటి విలువను దిగజార్చినట్టేనన్నారు. స్వదేశీ, విదేశీ పర్యాటకులు ఎక్కువగా వచ్చే బొర్రాపంచాయతీని రోజూ రెండుపూటలా పారిశుధ్య పనులు నిర్వహించి, పరిశుభ్రంగా ఉంచినా అవార్డుల ఎంపికకు ఎందుకు గుర్తించలేదని ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా సోమవారం పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఎంపిపి అధ్యక్షతన మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి మండల కేంద్రంలోని సిపిఎం సర్పంచ్ ఎస్.రూతుకు ఆహ్వానం లేదంటే అవార్డుల ఎంపిక, పంపిణీ ఎంత వివక్ష, ఏకపక్షంగా సాగిందో స్పష్టమౌతోందన్నారు.తక్షణమే దీనిపై సమాధానమివ్వకుంటే పంచాయతీల్లో పారిశుధ్యం, ఇతరత్రా పనులు నిలిపేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో అనంతగిరి పంచాయతీ ఉపసర్పంచ్. పాంగి అర్జున్ పాల్గొన్నారు

చినుకుపడితే చిక్కులే..!

వసతి లేమితో వారపుసంతల్లో అవస్థలు

దుకాణాలు వేసేందుకు చోటులేక అగచాట్లు

ప్రజాశక్తి-పెదబయలు : మన్యవాసుల సూపర్ బజార్లుగా చెప్పుకునే వారపుసంతల్లో వసతి లేమితో వ్యాపారులు, కొనుగోలుదారులు నానా ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. చిన్నపాటి చినుకులు పడితే అమ్మకానికి తెచ్చుకునే సరుకులు దాచుకునే పరిస్థితి లేక వ్యాపారులు అల్లాడే పరిస్థితి ఉంది. ఇక కొనుగోలుదారులైతే నిలువనీడ లేని వర్షంలోనే తడవాల్సిన దుస్థితి ఉంది. సోమవారం పెదబయలు వారపుసంతలో ఇదే జరిగింది. అప్పటివరకు మండిన ఎండలు, మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుని వర్షం కురవడంతో వారపుసంతలో దుకాణాలు వేసిన వారంతా నానా ఇబ్బందులకు గురయ్యారు. మార్కెట్ షెడ్ చిన్నదికావడం, ఇప్పటికే దాన్ని వేరొకరు ఆక్రమించుకోవడంతో వర్షంలోనూ సరుకులు, కూరగాయలతోపాటు వ్యాపారులు తడుస్తూ నిల్చోవాల్సిన పరిస్థితి. ఒడిశా నుంచి వచ్చిన వ్యాపారులు నానా ఇబ్బందులు పడ్డారు వర్షం వెలిసిన తర్వాత మెయిన్‌రోడ్డుపై కాకుండా ఇరుకుసందుల్లో దుకాణాలు పెట్టినా, అప్పటికే సమయం మించిపోవడం, వర్షం వల్ల కొనుగోలుదారులంతా తిరుగుముఖం పట్టడంతో తెచ్చిన సరుకులేవీ అమ్ముడుపోక గిరిజన రైతులు, వ్యాపారులు తీవ్ర అసంతృపికి గురయ్యారు. వర్షం కురిసిన ప్రతిసందర్భంలోనూ ఇదే పరిస్థితి ఉన్న నేపథ్యంలో ఏజెన్సీలోని వారపుసంతలకు షెడ్‌లను సమకూర్చాలని, వ్యాపారులు, కొనుగోలు దారులు కోరుతున్నారు.

మెయిన్ రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న దుకాణదారులు

రోడ్డుపైనే దుకాణాలతో ట్రాఫిక్‌కు ఇక్కట్లు

పెదబయలు వారపుసంతలో దుకణాలు వేసేందుకు షెడ్‌లు లేకపోవడంతో ఆరుబయటే రోడ్డు పక్కనే దుకాణాలు వేయడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. అసలే ఇరుకురోడ్డు కావడం, రెండువైపులా దుకాణాలు వేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం తప్పలేదు. అధికారులు స్పందించి, సంతలో దుకాణసముదాయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గిరిజనం కోరుతున్నారు.

మండుటెండలోనే ఉపాధి పనులు

పని ప్రదేశంలో సౌకర్యాలు లేక కూలీల అవస్థలు

ఎండలోనే చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలో తీగలవలస పంచాయతీ గరుడపల్లి గ్రామంలో సోమవారంఉపాధి పని చేస్తున్న కూలీలకు పనిప్రదేశంలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ఒకవైపు కూలీ డబ్బులు గిట్టుబాటు కావడం లేదని ఆవేదన చెందుతున్న కూలీలు, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఉపాధి పనులకు వెళుతుంటే అక్కడే సమస్యలతో ఇబ్బందులు పడే పరిస్థితులే ఉన్నాయి. పని ప్రదేశంలో నీడకు టెంట్లుగానీ, మజ్జిగ, తాగునీరు పంపిణీ, మెడికల్ కిట్లు ఏర్పాటు వంటి చట్టంలోని సౌకర్యాలు మచ్చుకైనా ఏర్పాటు చేయలేదని కూలీలు వాపోతున్నారు. ప్రస్తుతం మండుతున్న ఎండల్లో పనులు చేస్తున్న నేపథ్యంలో కూలీలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అంతేకాకుండా జాబ్‌కార్డుల వారీగా పనిదినాలను పెంచడంతో పాటు కూలీరేట్లు కూడా గిట్టుబాటయ్యేలా చెల్లించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. అలాగే వేసవి అలవెన్స్ కూడా చెల్లించాలని కోరుతున్నారు.

'సచివాలయాల్లో మెరుగైన సేవలందించాలి'

ప్రజాశక్తి -హుకుంపేట: సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన సేవలను అందించాలని జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగంసూచించారు సోమవారం మండలంలోని కొట్నపల్లి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అర్హులందరికీ సంక్షేమ పథకాలతోపాటు గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, ప్రజారోగ్యం, ఇతరత్రావిషయాలపై సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండి సేవలందించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో గృహ సారథి శివాజీ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీల సర్పంచులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న గంగరాజు తదితరులు

ఉత్తమ పంచాయతీలకు అభినందన

ప్రజాశక్తి -అనంతగిరి : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన సర్పంచ్‌లకు సోమవారం ప్రశంసాపత్రాలను ఇచ్చి అభినందించారు ఎంపిపి శెట్టి నీలవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపితోపాటు జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, ఎంపిడిఒ, ఇతర అధికారులు పాల్గొని ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూమండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, దేశాభివృద్ధికి పల్లెలే పట్టుగొమ్మలని, అలాంటిది పంచాయతీలకు కేంద్రం ఇస్తున్న నిధులను కూడా దారి మళ్లించి నిర్వీర్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీంతో గ్రామాల్లో ఎక్కడిసమస్యలు అక్కడే పేరుకుపోగా, అభివృద్ధి కుంటుబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలకు నిధులను సమకూర్చి పరిపుష్టి చేయాలని కోరారు.

ఆటో బోల్తా : తొమ్మిది మందికి గాయాలు

ప్రజాశక్తి -హుకుంపేట: బైక్ అడ్డంగా రావడంతో అదుపు తప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. మండలంలోని పెద్దగరువు జంక్షన్ సంతారి,ఉప్ప రహదారిలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలివి.

హుకుంపేట మండలం తడిగిరి పంచాయతీ బరింగిబంధ గ్రామానికి చెందిన గిరిజనులు వివాహ శుభకార్యానికి ఆటోలో వెళుతుండగా, కొట్నాపల్లి పంచాయతీ పెద్దగరువు జంక్షన్ వద్ద సంతారి ఉప్ప రహదారిలో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం అడ్డు రావడంతో దాన్ని తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పండింది. ఈ ప్రమాదంలో ఆటో అద్దం పగిలి, నుజ్జునుజ్జుకాగా, ప్రయాణికులంతా రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. ఈ ప్రమాదంలో పాంగి కామేష్, పాంగి.జ్యోతి పాంగి.భాగ్యలక్ష్మిలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిలో కామేష్ పరిస్థితి విషమంగా ఉంది. జ్యోతి, భాగ్యలక్ష్మిలకు తలకు బలమైన గాయాలు అయ్యాయి. ఆటో డ్రైవర్‌తోపాటు ఆటోలోని పిల్లలు, ఇతర ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను రోడ్డుపైనే కూర్చొబెట్టి, అంబులెన్స్‌కు సమాచారమిచ్చినా గంట సేపు వరకు రాకపోవడంతో బాధితులంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు క్షతగాత్రులను పాడేరు ఆసుపత్రికి తరలించి సేవలు అందిస్తున్నారు. ఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్ఐ వివరాలు సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -హుకుంపేట: గుండెపోటుతో ఆదివారం హఠాన్మరణం పొందిన కుడబీరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మఠం.బాలకృష్ణ కుటుంబాన్ని ఎంఇఒ సిహెచ్.బాబూరావు, ఇతర ఉపాధ్యాయ యూనియన్ నేతలు, ఉపాధ్యాయులు సోమవారం పరామర్శించారు. సోమవారం బాలకృష్ణ స్వగ్రామం మండలంలోని తాడిపుట్టు పంచాయతీ గడుగుపల్లివెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. పాఠశాలకు సకాలంలో చేరుకోవాలన్న తాపత్రయం, తీవ్ర ఒత్తిడి నేపథ్యంలో హఠాత్తుగా గుండెపోటు రావటంతో మరణించినట్లు కుటుంబ సభ్యులు చెప్పారని తోటి ఉపాధ్యాయులు తెలిపారు.బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంఇఒ బాబూరావు, ఇతర యూనియన్ నేతలు, ఆర్థికసాయాన్ని అందించారు. యూనియన్ నాయకులు మొదకొండ, ఎల్‌విఆర్.దొర, టి.మత్యరాజు, ప్రభాకర్, సింహాద్రి, బిఆర్‌కె.రాజు, కె బి.సింహాచలం, మన్మథరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరంతా బాలకృష్ణ భౌతిక కాయాన్ని సందర్శించి, ఘన నివాళి అర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వాణిశ్రీని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

సిఐటియు జిల్లా అధ్యక్షురాలు హౌస్ అరెస్టు

ప్రజాశక్తి - రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ సోమవారం సిఎం ఇంటిని గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ముట్టడించనున్నారన్న సమాచారంతో సిఐటియు రంపచోడవరం జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీని ఆదివారం రాత్రి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆమె అరెస్టును ఆదివాసీ నాయకులు ఖండించారు. పోలీసు నిర్బంధంతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ చేసిన తీర్మానాన్ని వెనక్కుతీసుకోకుంటే రానున్న కాలంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సుబ్బారావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నిరంతరం కార్మికుల కోసం పనిచేసిన గొల్లపల్లి సుబ్బారావు చరితార్థుడని, కార్మికులకు ఆయన చేసిన సేవలను ఎవ్వరూ మరిచిపోలేరని జివిఎంసి ఎడిసి సన్యాసిరావు కొనియాడారు. ఇటీవల మరణించిన ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు గొల్లపల్లి సుబ్బారావు సంస్మరణ సభ సోమవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగింది. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ముందుగా సుబ్బారావు చిత్రపటానికి సన్యాసిరావుతో పాటు పలువురు కార్మిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎడిసి సన్యాసిరావు మాట్లాడుతూ సుబ్బారావు కార్మికుల పనుల కోసం తమ వద్దకు వచ్చినప్పుడు కార్మికులకు మంచి జరగాలని, వారికి రావలసిన అన్ని హక్కులూ కల్పించాలని కోరేవారని చెప్పారు. ఆయన చాల దృఢ నిశ్చయం, పట్టుదల కలిగిన గొప్ప నేతని కొనియాడారు. అటువంటి గొప్ప నాయకుడిని కోల్పోవడం కార్మికులకు తీరని లోటని అన్నారు. సభకు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.నూకరాజు, ఉరుకూటి రాజు అధ్యక్షత వహించారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గొలగాని అప్పారావు, సిఐటియు జిల్లా నాయకులు బి.వెంకటరావు, సుబ్బారావు సతీమణి జి.మణి, సీర రమణ, జెఆర్.నాయుడు పాల్గొన్నారు.

753వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు సోమవారానికి 753వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు కంచరపాలెం జోన్ కార్యదర్శి ఒ.అప్పారావు, ఎస్.రామగోపాల్, ఎ.ఈశ్వరరావు, రజక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు పివి.రమణ పాల్గొన్నారు.

పిజ్జా హట్‌లో 10 కొత్త రుచులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశంలో ప్రజాధరణ కలిగిన పిజ్జా హట్‌లో వినియోగదారుల అభిరుచికి తగ్గట్టు మరో పది కొత్త రుచుల్లో పిజ్జాలను పరిచయం చేసినట్టు పిజ్జా హట్ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అనందిత దత్తా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పిజ్జా హట్ దేశంలో 800 దుకాణాలతో 199 నగరాలలో విస్తరించి ఉందని తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన రుచులలో మజేదర్ మఖ్నీ పనీర్, దాబేడా కీమా, చీజ్ మష్రుమ్ మ్యూజిక్, మెక్సికన్ ఫియస్టా, ఆసమ్ అమెరికన్ చీజీ నవాబి, ముర్గ్ మఖ్నీ వంటి 10 ప్రత్యేకమైన రుచులు ఉన్నాయన్నారు.

ఎయులో ఆధునిక ఓపెన్ ఎయిర్ థియేటర్

రూ.50 లక్షలతో పునరుద్ధరణ - 26న ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి విశ్వవిద్యాలయంగా పేరొందిన ఆంధ్ర యూనివర్సిటీలో ఆధునిక ఓపెన్ ఎయిర్ థియేటర్ ఈ నెల 26న అందుబాటులోకి రానుంది. ఎయు రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎదురుగా దశాబ్దాల క్రితం నుంచీ ఉన్న ఈ ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్వహణ లోపం వల్ల శిథిలావస్థకు చేరగా దీని పునరుద్ధరణ కోసం ఎయు విసి ప్రొఫెసర్ పివిజిడి.ప్రసాదరెడ్డి కొద్ది రోజుల క్రితం చర్యలు చేపట్టారు. దాతల సాయంతో రూ.50 లక్షలు సమీకరించి ఆధునిక సౌకర్యాలతో పనులు పూర్తి చేశారు. త్వరలో ఈ థియేటర్ సరికొత్త అనుభూతిని పంచనుంది.

ఆధునికీకరణ అనంతరం ఎయులోని ఓపెన్ ఎయిర్ థియేటర్

ఎయు ఓపెన్ ఎయిర్ థియేటర్‌కు ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉంది. నాటక కళకు వేదికగా నిలిచిన దీని పూర్తి పేరు కెవి.గోపాలస్వామి ఓపెన్ ఎయిర్ థియేటర్. నాటకరంగ అభిలాష కలిగిన పూర్వ రిజిస్ట్రార్ కెవి.గోపాలస్వామి ఆలోచన మేరకు 1957లో దీనిని నిర్మించారు. ఇక్కడ ప్రదర్శించే నాటకాలను తిలకించడానికి ఎన్‌టి.రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య, ఎస్‌వి.రంగారావు వంటి గొప్ప నటులు వచ్చేవారు. అటువంటి రంగస్థలం కాల గమనంలో కొంత నిరాధరణకు గురైంది. చాట్ల శ్రీరాములు, అబ్బూరి గోపాలకృష్ణ, సాక్షి రంగారావు, వంకాయల సత్యనారాయణ, మిస్రో, అత్తిలి కృష్ణారావు వంటి నాటక, సినీ రంగ ప్రముఖులు ఈ వేదికను ఆధారంగా చేసుకుని ఎదిగారు. హుదూద్ తుపాను సమయంలో ఈ థియేటర్ దెబ్బతింది. ఇంతకాలానికి రూ.50 లక్షలు వెచ్చించి పునర్నిర్మించారు. వేదికను 24 అడుగుల ఎత్తులో రెండంతస్తుల బ్యాక్ స్టేజీతో సిద్ధం చేశారు. కళాకారులకు ఉపయుక్తంగా వేదికకు ఇరువైపులా గ్రీన్ రూమ్స్ నిర్మించారు. రంగస్థలంపై వివిధ ప్రకృతి సిద్ధ సన్నివేశాలను ప్రదర్శించడానికి ఆధునిక పద్ధతిలో ఏర్పాట్లు చేశారు. పాత సీటింగును పూర్తిగా తొలగించి, అనువైన రీతిలో సీటింగ్ ఏర్పాట్లు సమకూర్చారు. వేదికపై కళాకారులకు ఉపయుక్తంగా ఒక టాయిలెట్ బ్లాక్‌ను, వేదికకు పక్కనే ప్రేక్షకుల కోసం ప్రత్యేకంగా మరొక టాయిలెట్ బ్లాక్‌ను ఏర్పాటు చేశారు. ఎలివేషన్, గ్రిల్స్ ఏర్పాట్లు ఉన్నాయి. వర్షం కురిసిన సమయంలో నీరు బయటకు వెళ్లడానికి ప్రత్యేకంగా డ్రైనేజీ వ్యవస్థను రూపొందించారు. అందమైన పద్ధతిలో ఫ్లోరింగ్ నిర్మాణం చేపట్టారు. నెక్కంటి సీఫుడ్స్, కోరమండల్ పెయింట్స్ సంస్థలు అందించిన సిఎస్‌ఆర్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన వేదిక ఎదురుగా 600 మంది వరకు ప్రేక్షకులు కూర్చొని కార్యక్రమాలను వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం గతంలో ఉన్న విధంగా సిమెంట్ బెంచీలను నాణ్యతతో నిర్మించారు.

కళలకు ప్రోత్సాహం

విద్యార్థులను విద్యతో పాటు కళలు, క్రీడల్లో కూడా ప్రోత్సహించేలా ఎయు అధికారులు కృషి చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనకు ఉపయుక్తంగా ఆరుబయలు రంగస్థలాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించి అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ నెల 26న జరగనున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం 98వ వ్యవస్థాపక దినోత్సవం రోజున ఈ థియేటర్‌ను పున్ణ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎయు రంగస్థల, సంగీత, నృత్య విభాగాల విద్యార్థుల ప్రదర్శనలతో పాటు నగరంలో సాంస్కృతిక కార్యక్రమాల వేదికగా దీనిని వినియోగించాలని అధికారులు భావిస్తున్నారు.

సమస్యలపై మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వమే వంట గ్యాస్ సరఫరా చేయాలని, కార్మికులకు వేతనాలు పెంచాలని, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పి.వెంకటరావును పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. పోలీసు చర్యలను సిఐటియు, ప్రజా సంఘాల నేతలు ఖండించారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, జిల్లా కార్యదర్శులు ఎ.సీతాలక్ష్మి, జి.అప్పలరాజు, ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మంగశ్రీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రాగిజావ వండి, సరఫరా చేయాలని ఇచ్చిన ఆదేశాలను అక్షయపాత్ర సంస్థవారు అమలు చేయడం లేదన్నారు. అక్షయపాత్ర ఉన్న జివిఎంసి వార్డుల్లోనూ, ఆనందపురం, భీమిలి మండలాల్లోనూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులే రాగిజావ వండుతున్నారన్నారు. సదరు సంస్థ వారు కేవలం భోజన సరఫరా మాత్రమే చేస్తున్నట్టు తెలిపారు. కనుక తమకు తక్షణం గ్యాస్, పాత్రలు, పాత్రలు శుభ్రం చేయడానికి సబ్బులు, సర్ఫ్‌లు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని కోరారు. కోడి గుడ్లు ఉడకబెడుతున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక గుడ్డుకు ఇస్తున్న 10 పైసలును కూడా ప్రతి నెలా ఇవ్వడం లేదన్నారు. హై స్కూల్, అప్పర్ ప్రైమరీ స్కూల్, ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఒకే ఒక్క మిడ్డేమీల్ వర్కర్‌ను జివిఎంసి పరిధిలో నియమించడం వల్ల పనిభారం పడుతోందన్నారు. కేవలం రూ.3 వేలు వేతనం మాత్రమే ఇస్తుండటంతో బతకడం ఇబ్బందిగా ఉందని ఆవేదన వెలుబుచ్చారు.

ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

సీలేరు వ్యూ...

డ్రోన్ కెమెరాలో సీలేరు అందాలు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ప్రకృతి రమణీయమైన దృశ్యాలను సీలేరుకు చెందిన కె.సందీప్ అనే యువకుడు డ్రోన్ కెమెరా ద్వారా సోమవారం ఉదయం బంధించారు. స్థానిక ఏపీ జెన్కో రిజర్వాయర్, అయ్యప్ప స్వామి దేవాలయం, ఎంతో ప్రాముఖ్యత కలిగిన మారమ్మ అమ్మవారి గుడి, జిడిసి క్యాంప్, పోలీస్ స్టేషన్ తదితర సీలేరు అందాలు డ్రోన్ కెమెరాలో బంధించిన దృశ్యాలు వాట్సాప్ గ్రూపుల్లో హల్ చల్ చేస్తున్నాయి. ఈ దృశ్యాలు చూపురుల మనసులను ఎంతగానో హత్తుకుంటున్నాయి. డ్రోన్ కెమెరా ద్వారా తీసిన చిత్రాన్ని పరిశీలిస్తే సీలేరు పరిసర ప్రాంతాల్లో ఎంతటి ప్రకృతి రమణీయ దృశ్యాలు దాగి ఉన్నాయో అర్థమవుతుంది. ఒకపక్క ప్రకృతి రమణీయ దృశ్యాలు, మరోపక్క సీలేరు నదీ జలాలు, ఎత్తయిన కొండలు, పచ్చని చెట్లు అందాలు చూపరులు దోచుకున్నాయి. ఇటువంటి ప్రకృతి రమణీయమైన దృశ్యాలు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో మరి ఎన్నో ఉన్నాయని పలువురు నెమరు వేసుకుంటున్నారు.

నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

టైమింగ్స్ అమలు చేయకపోవడంపై అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం) : అంగన్‌వాడీలు, హెల్పర్లకు ప్రభుత్వం నిర్దేశించిన టైమింగ్స్‌ను అమలు చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.తులసి, ఎల్.దేవి డిమాండ్ చేశారు. జిల్లాలో టైమింగ్స్ అమలు చేయకపోవడంపై సంఘం ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం.. మధ్యాహ్నం ఒంటి వరకు మాత్రమే తాము అంగన్‌వాడీ కేంద్రంలో ఉండాలని, అధికారులు దానికి భిన్నంగా వ్యవహరిస్తూ మూడు గంటల వరకు ఉండాలని చెబుతున్నారని తెలిపారు. వేసవి ఎండల తీవ్రత వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. ఐఎఫ్ఎ టాబ్లెట్స్, సిరప్ వారంలో రెండు రోజులు 3 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇవ్వాలని పై నుంచి పంపించారని, టాబ్లెట్స్ నాలుగు రకాలుగా ఉండటంతో తాము గందరగోళానికి గురవుతున్నామని తెలిపారు. టాబ్లెట్స్ పిల్లలకు వేస్తే వారు చిరాకుగా ఉంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు వచ్చి టాబ్లెట్స్ వేస్తే బాగుంటుందని అన్నారు.